

# హాస్యపాత్రసమ్మేళనము

## కోటమర్తి చిన రఘుపతిరావు.





ఇందలి పాత్రములు:

మునిమాణిక్యం నరసింహారావుగారి కాంతం (కథానాయిక).

మొక్కపాటి నరసింహా శాస్త్రిగారి బారిస్టరు పార్వతీశం (కాంతం భర్త).

నండూరి సుబ్బారావుగారి నాయుడు బావ (భార్య) యెంకి.

గురజాడ అప్పారావుగారి గిరీశం (భార్య) బుచ్చెమ్మ.

కాంతం:—చామనచాయ రంగు. వయస్సు 30 సంవత్సరములు, కొంచెము పొడగరి. నుగ్గు నుగ్గు నెరి కురులతో పిరుదులు దిగి వ్రేలాడు జడ. తీర్చి దిద్దిన కనుబొమలలో నొక క్రొత్త సోయగము లీను నేత్రయుగ్మము. కుడి బుగ్గపై చిన్న గుంట, నవ్వినప్పుడు చిరుతవాటు మొగము, కొంచెము పొడవైన ముక్కు, ఎఱ్ఱరంగు పెదవులు, తరుచు ముసి ముసి నగ వాపెదవుల సందునుండి తొంగి చూచును. చదువరి. భావగీతముల వ్రాయను నేర్పరి. ప్రౌఢ, సమయ స్ఫూర్తి గలిగిన కాంత. బారిస్టరు పార్వతీశంగారి భార్య.

ఎంకి:—కాంతంగారి దొడ్లోనే పాక గట్టుకొని కాపుర మున్నది. మాయమనువులో నాయుడు బావను తెచ్చుకొన్నది. పరాకరణ శక్తి గలిగిన ప్రౌఢ. గ్రామమునందలి పెక్కు ఎంద్ర జాలు అందికొనియు సమాధాన ముల నీయక మడి గట్టుకొనిన మగువ. ఎంకిని జూచి అనుమానింపని వాడుండడు. చూచి చూచి నాని మందిడే యని సిగ్గుపడని వారుండడు. నవ్వు దానిసొమ్ము. నవ్వితే నవరత్నాలు రాలునని నాయుడు బావ పెక్కుసార్లు బారిస్టరు పార్వతీశంగారితో చెప్పుచుండెడివాడు. ఎంకి వట్టి అమాయకురాలు.

బుచ్చెమ్మ:—గిరీశంగారు కట్టించిన ఆకాశ హర్మ్యములలోని భద్ర డోలికలలో నూగ దలచుకొని తల్లిదండ్రుల బాసివచ్చిన అమాయకురాలు. గిరీశంగారికంటె యెత్తైన ఆకాశ హర్మ్యములు కట్టు గలిగిన నేర చేరవ్వడైన నున్న వాని వెన్నంటి పోవుటకు బుచ్చెమ్మ వదిన కభ్యంతర మెంతమాత్రము తెలియవచ్చుట లేదు. మనకి కిరువదినాల్గు గంటలుకూడ కాంత మ్మక్కయ్యతో కాలక్షేపము చేయుటే పని. కాంతం గీచిన గీటు కుండుటయే బుచ్చెమ్మ పని. మంచియైన చెడ్డయైన కాంతము ననుసరించుట కామె కభ్యంతరము లేదు.

నాయుడు బావ:—వట్టి శృంగార రసప్రియుడు. భావ కవిత్వమున నాంధ్రులలో మొదట దారి తీసిన వాడు. సంగీత జ్ఞాని. చక్కని పదముల పాడి యెంకి హృదయమును చూరగొనివాడు. ఆంధ్రులలో మొట్ట మొదట బాబింగు జుట్టు పెట్టుకొనిన మహా పురుషుడని యీ నడుమ రాజమహేంద్ర వరములోని హిస్టారికల్ రిసెర్చి సొసయిటీవారు ప్రకటించి యున్నారు. బంగాళా పంచెకట్టు, వదులుగనున్న శిల్కులాల్చి, షాషా అండ్ కో. వారి రోల్డుగోల్డు సులోచనములు, ఎప్పుడో తిరుగుట మానిన రోల్డుగోల్డు రిస్టువాచీ, తంజావూరు స్లిప్పర్సు గలిగి పుట్టరేదము లేక పోయినను పెట్టందముతో ప్రకాశించుచుండెడి వాడు. నాయుడు బావ తన ధన బల ప్రాణములు వేయేల బ్రతుకే యెంకిని సర్వ విధముల సంతోష పెట్టుటకని గిరీశంగారితో చెప్పుచుండెడివాడు.

బారిస్టరు పార్వతీశం:—వామనుడు, కుడికన్ను మెల్ల, ముంగముక్కుపై పోతరపు పొటిమలు అతని యదృష్టపు మెల్లయని అతడు గుర్తించుకొనిన మరునాడే కాంతం భార్యగా లభించింది. అదే మహదైశ్వర్యం అనుకొన్నాడు. పెళ్లాంకొఱకు పదివేలు పిత్రీయం ఖర్చైనా ఇంగ్లండు ప్రయాణానికి కొన్న బంతిపువ్వు రంగు ట్రంకుపెట్టె అచ్చి వచ్చినదని అందులో లా పుస్తకములు, రికార్డు, రెండు బాతు కలములు, మట్టి సిరాబుడ్డి, యిసుకసనా, దస్తూరీ కునురుటకు సున్నలు చుట్టు పీచు కాగితముల కాపీ వరవడి పుస్తకము వగైరాలు తాళ మెరుగని యా ట్రంకులో నుంచి చేంతాడుతో నా పెట్టెను గట్టిగ దబాయించి కట్టి స్వంత తిరు హస్తములతో కోర్టుకి తీసుకొని వెడలుచుండెడివాడు. దొరసాని హేటుమాత్ర మాతడు మఱచుట లేదు. మఱచినను ఆ హేటును పార్వతీశంగారిని కలిసి యెరిగి యున్నంతవఱ కెవరో యొక రా హేటును తెచ్చి యింటికడ నిచ్చుచుండెడివారు. ఇతనికి కోర్టులో ప్లీడరీ చేయుటకంటె నింటిలో వంట వండుటయం దెక్కువ ప్రీతి.

గిరీశం:—ఆకాశ హర్మ్య నిర్మాత. ఒకకంట యెంకిని, వేరొక కంట కాంతమును జూచి సంతోషించెడివాడు. నూతనముగ కుంకుమబొట్టు పెట్టుకొనుట నలవాటు చేసికొనుచున్న బుచ్చెమ్మలోని మాధుర్యము తగ్గ చప్పబడుట ప్రారంభించినది. విధవా వివాహము చేసికొనినవాడని యీతని కెవరును బ్రాహ్మణులు యిల్లు అద్దె కిచ్చుటకు మానినారు. ఇంగ్లండు వెళ్ళి వచ్చినప్పటినుండియు నక్కడనే యెందులకు పుట్టించినావు గావని నిత్యము భగవంతుని నిష్టోత్తర పారాయణ తిట్లతో పూజ చేయుచున్న బారిస్టరు పార్వతీశంగారికి గిరీశంగారి కిల్లిచ్చుటలో నభ్యంతర మెందుల కుండవలెను. వారి యింటిలోనే యొక వాటా ఖాళీచేసి గిరీశం బుచ్చెమ్మగార్ల కద్దె కిచ్చినాడు ఆరునెలల కొకనెల యద్దె నిచ్చుచు గిరీశంగారు మిగిలిన యద్దెక్రింద పార్వతీశంగారికి తమ యపార ధర్మ శాస్త్రి జ్ఞానమును బోధించుచు కాలక్షేపము చేయుచుండెడి వాడు. గిరీశం మాట్లాడుట ప్రారంభించగానే కాంతం లోనికి పోవుచుండెడిది. కాని యెంకిమాత్రము మొగమంతయు కన్నుల జేసుకొని మందహాసము జేయుచు సంతోషించు చుండెడిది, అమాయకురాలు కాబట్టి.

# అపూర్వ పాత్ర సమ్మేళనము లేక Damit! కథ అడ్డంగా తిరిగింది.

ఏకాంకము

స్థలం:—బారిస్టరు పార్వతీశంగారి యిల్లు.
ప్రవేశం:—కాంతం.



కాంతం:—(వంట వండుచు, ప్రోయి నూదుచు) ఉఫ్: ఉఫ్: అబ్బ! దిక్కుమాలిన పొయ్యి ఎంతకి మండదు. ఇవాళ కోర్టువేళకి వంట కావాలంట. ఇంట్లో ప్రొద్దుటి నుంచి చిందులు ప్రారంభమ్మయినాయి. బల్ల కట్టిన పిదప పావలా డబ్బులు ప్లీడరీ పేరు చెప్పి కంటితో చూడలేను

గాని పరవళ్లు మాత్రం రోజుర్లోజూ యెక్కు వగుచున్నాయి

(దొడ్లోనుండి నాయుడు బావ పాడును)

ఎంకివంటిపిల్ల లేదోయి - లేదోయి
ఎంకి నావంకింక రాదోయి రాదోయి
మెళ్ళో పూసలపేరు తల్లో పూవులసేరు
కన్నుల్తిప్పితే సాలు-కనకాభిసేకాలు　　॥ఎం॥

కాంతం — ఏం నాయుడు బావ! మీయెంకి యెక్కడికి వెళ్లింది?

నాయుడు — ఏం చెప్పను తల్లీ! (పాడును)

ఎంకివంటిపిల్ల లేదోయి లేదోయి
యెంకి నా వంకింక రాదోయి రాదోయి.

కాంతం — అంతగా విచారిస్తున్నావు—ఏం నాయుడు బావా! మీయెంకి యెక్కడికి వెళ్లింది?

నాయుడు — ఏం చెప్పను తల్లీ! పుట్టింటికి—

కాంతం — ఎందుచేత?

నాయుడు — చెప్పుకుంటే సిగ్గమ్మా! ఎందుకు లెండి తల్లీ! మమ్మల్ని ఇట్లు బ్రతుకనీయండి.

కాంతం — భయంలేదు చెప్పు.

(ప్రవేశం బుచ్చమ్మ - ఇనుపగరిటె చేతిలో పట్టుకొని)

బుచ్చి — అక్కా! కాంతం అక్కా! కొంచెం నిప్పు పెడుదూ గరిటెలో. వంటకి వేళైపోయిందని కోప పడుచున్నారు. మా ఆయనకు రామేశ్వరం రాజాగారు కబురు పంపారు వుద్యోగమిస్తానని, అంచేత పెందలాడే భోంచేసి వెళ్లాలని అనుకొంటున్నారు.

కాంతం.— జీతం యెంతమ్మా!

బుచ్చి — గిరీశం పంతులుగారు మా దగ్గిర పని చేయడమే చాలును వారు యెంత అడిగితే అంతా యిస్తామని వారి దివానుగారిచేత కబురు పంపించారు రాజాగారు స్వయంగా.

నాయుడు — (గట్టిగా) అమ్మగారూ! నా గొడవ గేమని చెప్పమన్నారు. గిరీశం పంతులుగారిని చూచి మాయెంకి భయపడి పుట్టింటికి వెళ్లిపోయింది.

బుచ్చి — అదేమిటి అక్కా (ఆశ్చర్యముగా).

కాంతం — (గట్టిగ) ఆగు! అంతా చెప్పిస్తా.

నాయుడు:— మా యెంకి మహా మంచి పిల్లండి. (పాడును)

పదము పాడిందంటె - పాపాలు పోవాల
కతలు సెప్పిందంటె - కలకాలముండాల -
　　　　　　　　　　　　[యెంకివంటి పిల్ల.

కాంతం — చెప్పమ్మా! నాయుడు బావా! విచారింపకు.

నాయుడు:— ఏం చెప్పను తల్లీ! బుచ్చెమ్మ పిన్నిగారితో మాట్లాడాలని వారి వీధి గదిలోనికి వెళ్లేటప్పటికి గిరీశంగారు మా యెంకిని జూచి "యెంకీ! ఇంతందంగా వున్నావు. నీవు దేవునికి పుట్టావా! మనిషి మాత్రుడికి పుట్టావా!" అని అడిగినారట. "ఏంబాబూ! అల్లా అంటారు" అని యెంకి అయన్ని అడిగిందట!

బుచ్చి — ఔను! అడిగినారు. అప్పుడు నేను అక్కడనే వున్నాను.

నాయుడు అమ్మా! వినండి. మళ్లా వూ స్కుకోకండి. గిరీశంగారు "యెంకీ! యెంకీ!! నీకీ అందం దేన్నిబట్టి వచ్చింది చెబుతావా! చెప్పవా!!" అని అడిగినారట.

బుచ్చి — నేనా ముక్కలు వినలేదమ్మా! నిజం చెప్పక పోవడమే. దొడ్లోనికి వెళ్లవలసిన పనివచ్చి వెళ్లాను. అదేనా గిరీశంగారు చినుకులు పడుచున్నాయి, దొడ్లో కోటు దండెముమీద వేసినాను, త్వరగా తీసికొని రమ్మని నన్ను పంపడంచేత వెళ్లిపోవలసి వచ్చింది.

కాంతం — అయితే యింకేమి?

నాయుడు — కాంతం పిన్నిగారూ? ఎవరితోనమ్మా వూసులాడుచున్నారు.

కాంతం:— ఎవరు లేరు నాయనా! చెప్పు.

నాయుడు — తర్వాత మా యెంకి వచ్చి వేయాలని చూస్తూవుంటే గిరీశంగారు అడ్డు వచ్చి నీకీ అందం యెక్కడ వుందో చూపెదవా లేదా" అని అడిగినారట.

కాంతం:— ఊహూం! అంతవరకు వచ్చింది సరే.

నాయుడు — అంతే కాదండి "నన్ను ఆపకండి! మా నాయుడు బావ పిలుస్తున్నాడు. వెళ్ళి పోవాలి"

అని యీవలకు వచ్చే ప్రయత్నం చేస్తూవుంటే మాయెంకి, గిరీశంగారు "ఆడది ఒక్కరి సొమ్ముగాదు" అని కొన్ని పద్యాలు, పాటలు పాడి చివరికి తత్వోపదేశం చేశారటండి.

బుచ్చె:—ఆ! ఆ!! అంతపనే! నేను కనుక్కుంటా నక్కయ్యా! వుండు (అని గరిటతో నిప్పు పట్టుకొని వెడలిపోవును).

కాంతం:—గట్టిగా కనుక్కో! అక్కా!—నాయుడు బావా! అప్పుడు నీతో చెపితే యేం జేశేవు?

నాయుడు:—ఎంకిలేని జన్మం యెందుకని మన పంతులుగారితో డామేజీదావా దాఖలు చేయమని నోటీసు రాయించానండి నిన్న.

కాంతం:—అదా! రాత్రి మీ యిద్దరి గుసగుసలును. మంచి పని చేశావులే.

(ప్రవేశం బారిష్టరు పార్వతీశం తాడుతో కట్టిన సులోచనములు నుదుటి కడ్డముగ బెట్టుకొని బంతి పువ్వు రంగు ట్రంకుపెట్టెకి గట్టిన చేంతాడుతో)

పార్వ:—ఏయి! పిల్లా! వంటయిందా?

కాంతం:—అప్పుడే

పార్వ:—ఇంకా యింత ఆలస్యమా!

కాంతం:—ఏం తొందర?

పార్వ:—ఇవాళ దావా దాఖలు చేయాలిగా.

కాంతం:—మరి ఆ మాట యిందాకానే చెప్పలేక పోయారూ?

పార్వ:—చెబితే.

కాంతం:—మిమ్మల్నే మడి గట్టుకొనమందును.

పార్వ:—ఏడిచినట్లే వుంది. సరే లే! నీవు భావగీతాలు వ్రాసుకో, నేను వంట వండుతాను.

కాంతం:—నా పేచు కౌగితాల పుస్తకం మీరు కాపీ వరువడి పెట్టుకోవడానికి పుచ్చుకొన్నారుగా!

పార్వ:—ఔను మరి. సంతకమైనా బాగా చేయడం చేత కాకపోతే నీ పక్షాన్ని తీర్పు యెన్నడు యీయనని జడ్జీగారు ఘంటాపథంగా చెప్పారు. రోజు రోజు యెన్ని కాపీలు వ్రాసింది ఆయనికి చూపించాలన్నారు. అందుచేత నీ పుస్తకం తీసుకోవలసి వచ్చింది కాని లేకపోతే నాకెందుకు! రేపట్నుంచి జడ్జీగారు నా పక్షాన్ని తీర్పులివ్వడం ప్రారంభిస్తే కావలసినంత డబ్బు, లక్ష పుస్తకాలు. ఇంకోమాట! ఎందుకని యీ అయిదేళ్లనుంచి జడ్జీగారి కళ్ల బడకుండా కాలక్షేపం చేసుకొని వస్తూన్నానుగాని, రేపట్నుంచి కోర్టులో వారి యెదుట బడ్డామంటే తీర్పు మన పక్షాన్ని వచ్చిందన్న మాటే. మన మంటే యేమిటో తెలిసిందా! జడ్జీగారి గుండెకాయ అన్న మాట. అందుచేతనే ఆయన నన్ను "నువ్వెన్నడు బారులోనికి వచ్చి నిలువబడ నక్కరలేదు. నా ప్రైవేటు రూములో మాట్లాడి వెళ్లిపో" అన్నారు. మరి చూడు. ఇటువంటి సావకాశము నా కొక్కడికే దొరికిందిగాని పై వెధవలకి యెవరికి కుదిరింది?

కాంతం:—మరి యీ కేసుమాత్రం మీరు వ్రాసి దాఖలు చేయ నక్కరలేదు.

పార్వ:—మనలోవున్న విశేషమే అది కేసు విషయం అంటే తెలిసిందా ప్లయింటు, సారాంశాలు, సాక్ష్యం అడ్డం నిలువుకూడాను—ఆర్గుమెంట్లు అన్ని నోటితోనే మంచినీళ్ల ప్రవాహంలాగ గడగడా వాగేయడమే—దాంతో జడ్జీగారు డంగై మన పక్షాన్ని తీర్పిచ్చేస్తారు. వారిక కావలసిన ఫది కాపీలు మాత్రము, ఖస్తుగా, గుండ్రకత్తుని, శుభ్రముగా, వంకరలులేకుండ, అందముగా, ముత్యాలకోవవలె, షోకుగా వ్రాసి దాఖలు చేసుకొంటే చాలు—

(ప్రవేశం గిరీశం, రిజిష్టరుడు నోటీసు చేతిలో పట్టుకొని వెంట బుచ్చెమ్మ ఆ వెనక నాయుడు బావకూడ ప్రవేశింతురు).

గిరీ:—What is this Mr Short?

పార్వ:—A Registered Notice.

గిరీ.—చదువండిమీ.

పార్వ:—ఏం, దస్తూరీ తెలియటంలేదా? అయితే యిల్లా తే. (అపవారించి కాంతంతో) ఈ వుత్తరం సమాసాలతో నింపేశాను. అందుచేత వాడు చదువుకోలేక తిరిగి నా వద్దకే తీసికొని వచ్చాడు. (కవును

రాగిముతో వృత్తరము చదువుట ప్రారంభించును).

"అస్మదీయ క్లయింటుయిన నాయుడు బావగారు మాకు చెప్పుకొన్న దేమనగా! వారు తమ హృదయేశ్వరియైన యెంకిని అద్వితీయ ద్వితీయ పునర్వివాహంబు యథా శాస్త్రీయంబుగ గాంధర్వ విధిం బరిణయం బాడి సుఖం బుండునంత, భవదీయులు కేవలము తమ మన్మథ శాస్త్రి ప్రవీణము తేట తెల్లంబుకాక మంచినాక చెడ్డనాక, కేవల మోహము చూపించుటచే హృదయేశ్వరి కన్నుల బాష ప్రకరణంబులు రాల విచారించు యెంకి నస్మదీయ క్లయింటుం బాసి స్వేచ్ఛాగతిం జనుటచే మక్లయింటు తమకు వినయ పూర్వకంగా విన్నవించుకొనే రిజిస్టరు నోటీసు—

భవదీయ చెడ్డ కృత్యంబులచే నాకు భార్యా వియోగంబు సంభవించుటచే నస్మదీయ లోపంబు నివర్తించు భారంబు మీపైనుంట మీరే స్వయంబుగా నా పెళ్లిదీర్ప కోరుకొనుచుంటిని. అట్లు భవదీయులు దీర్పంజాలనిచో తగు పరిహారములతో తగు చర్యలు మహారాజరాజశ్రీ కోర్టువారిద్వారా ముదరా జరిపించి నా లోపంబు పూర్తి చేసికొనబడునని యిందుమూలమున తెలియజేయడమైనది. ఇందులకు సరియైన నకలు మా స్వంత యినుప పెట్టెలో భద్రము చేసికొనబడినదని తెలిసికొనవలెను.

గిరీ:—ఓహోహో!! చాలా బాగుంది. అన్ని జాతి ముక్కలు వేసి కాచిన అయ్యంగారి కూటులాగ చాలా బాగుంది. (అని నవ్వును).

పార్వ:—What is this? ఎందుకీ నవ్వు? డామేజీ దావా దాఖలు చేస్తున్నా యివాళ.

గిరీ:— ఓ! చేసుకోండి! ఈ మునసబుగారు నాకు కొత్తవారు కారు. ఆయన భార్య నేను Madras లోని Presidency College లో 1st Form నుంచి Classmates నేనంటే ఆమెకు Special Love. తెలిసిందా! ఒక్కసారి ఆవిడతో చూచాయిగా అందిచ్చానంటే చాలు. అసలు ఆమాటకొస్తే అందించ నక్కరలేదు. మేమిద్దరము Loving Friends ము అని మునసబుగారికే తెలుసును. కాబట్టి నామీద file అయిందంటే టపీమని కొట్టేస్తాడు. అగ్ని హోత్రావధాన్ల గారి కేసులో యేం జరిగింది? అసలు ప్లయింటే చేత్తో పట్టుకోనన్నాడు. అలోమని అఘోరిస్తూ పోయ్యా డాబ్రాహ్మడు! పాపం.

పార్వ:—ఏమయితే యేం. నేనన్నా యిష్టం లేక పోలేదు. ఇవాళనుంచి నేను దాఖలు చేసిన కేసులన్నీ కంటనే తీర్పు యిచ్చేస్తా నన్నారు మునసబుగారు.

గిరీ:—ఓ! చూస్తానులే. కాని అసలు యెంకిని యేమ రేమన్నారు. అంటే యేంతప్పు? అదేమిటో చెప్పు.

పార్వ:—మీరు చేసిన పనులు Law Permit చెయ్యదు.

గిరీ—Nonsense! అసలు Law Maker అను, Giver అను వాడు మనుష్యుడేనా! నాకు వాడిలో Belief లేదు. వాడి అమ్మమ్మ గుడిసిబ్రేటిది. వాడి తాత Rape నేరంచేసిన నిర్భాగ్యుడు. అందుచేత వాడి Ancestors అంటే పూర్వీకులే అగౌరవమైన పనులు చేయడం ప్రారంభించారు. వాళ్ల వంశంలోనివాడు Laws చెయ్యడం; నావంటి బుద్ధిమంతుడు వాటిని Care చెయ్యడమునా? Nonsense తీసి పారవేయి. అల్లా చెయ్యనంటావు. ఇదిగో అసలు విషయం Golden Letters quote చేస్తా విను. "ఎందే నింద్రియముల్ సుఖంబు గను నాయింపే పరబ్రహ్మ మానందోబ్రహ్మ" మని మీ Law Giver యొక్క అమ్మమ్మ వీణమీద మీటుతూ quote చేసింది అబద్ధం అంటావా? అనదల చుకుంటే అల్ల సానివారి ఆంధ్ర కవితా పితామహుడిని అడుగు. అంతకంటె పురాణసాక్ష్యం కృష్ణ దేవరాయుల్ని అడుగు.

పార్వ:—Really. మీరు చెప్పింది బాగుంది.

గిరీ:—Now ఇంకొక విషయం. Between a man and a woman అంటె స్త్రీపురుషులమధ్య పురుషుడే అధికుడని మీ రంగీకరిస్తారా!

పార్వ:—All right గా?

గిరీ:—మీరండి కాంతం వొదినగారూ?

కాంతం:—నే నంగీకరింపను.

గిరీ.—ఏం. My honey, Dear బుచ్చెమ్మ. నీవు!

బుచ్చె:—మా కాంతం అక్క అంగీకరింపలేదు కాబట్టి నేను అంగీకరింపను.



గిరి:—Nonsense You are a brute. అంటే నీ యంగీకారమెంత? Well my dear Mr. Short! పురుషుడే అధికుడని సమస్త శాస్త్రాలు, సర్వ ధర్మాలు, సకల పురాణాలు, చతుర్వేదాలు వేనోళ్ల ఘోషిస్తూ వుండగా మన కావిషయంలో సందేహం అక్కరలేదు. మరొక్కటి. స్త్రీ అనే పదార్థం వుందే అది ఒక Perpetual dependent పదార్థం. ఎప్పుడూ వాళ్లకి Independence లేదు. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని జ్వాలలో ఘోషిస్తున్నారు. నీవు చదవడం లేదు కాబోలు. పోనిలే దానికేంగాని, నేచెప్పిన విషయాన్ని రెండు మాటలలో ఋజువుచేస్తాను. స్త్రీని లత, లతాంగి, అని పిలుస్తారుగదా! ఆలత నిలవబడాలంటే వేరే చెట్టో యేదో ఆధారం దొరకద్దు? అంచేత స్త్రీ యెప్పుడు పురుషునిమీద ఆధారపడుతుంది. చిన్నతనంలో తండ్రిమీద, యవ్వనంలో మొగుడుమీద, మగడు లేనప్పుడు బాగా సంరక్షణ చేసే కొడుకుల్లమీద, వృద్ధాప్యం వచ్చిన వెనక కొడుకులమీద ఆధారం తప్పదు. అందుచేత భర్త అనేవాడు—అనగా పురుషుడని అర్థం—భరింపవలసినవాడు. తన వాళ్లయొక్క మంచి చెడ్డలన్నీ కడుపులో పెట్టుకొని భరింపవలసినవాడు భర్త.

పార్వ:—Perfectly right.

గిరీ:—ఏం నాయుడు బావ ఏమంటావు?

నాయు:—పెద్దలు, సదువుకొన్నవారు. మేము వినవలసినవారము అంతేనండి.

(ప్రవేశం: కోర్టు బంట్రోతు)

బంట్రో.— పార్వతీశంగారు, ఇదిగో హాటు, (హాటు యిచ్చి వెడలిపోవును).

పార్వ —ఎక్కడ జ్ఞాపకం వుంచుకొని పనిగట్టి మరిచిపోయి వచ్చినాగాని యెవడో వెధవ తెచ్చి యిస్తూనే వుంటాడు.

గిరీ —అబ్బ Flow కి అడ్డు రాకూడదు. అయితే యిప్పుడేం చెబుతున్నాను?

పార్వ.—Light House చాలా యెత్తుగా వుందని.

గిరీ.—నా మొగము (ఆలోచించి) Dependence and Independence ని గూర్చి. ఆ విషయానికొస్తే ఇంకొక క్రొత్త Theory కూడా Propogate చెయ్యవచ్చు, చూడు. For example, "A woman is never one man's property" అంటే స్త్రీ ఒక్క పురుషుని సొత్తు కాదు. ఇప్పుడు Russia అమెరికా మొదలైన గొప్ప గొప్ప దేశాల్లో ఘరణ అంత రాజుదే. ఆస్తి అంతా రాజుదే. ప్రజలందరు కలిసి ఆ ఆస్తిని సమానంగా పంచుకొంటారు. ఆలాగునే స్త్రీనికూడా పంచుకొనవచ్చునని, పంచుకొని తీరాలని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఉదాహరణ చూడు. ద్రౌపదిని అర్జునుడు గెలిచి తెచ్చుకొన్నాడు. అంతమాత్రాన్ని అర్జునుని సొమ్మైపోయిందా ద్రౌపది. కాదు, ఆడది ఒక్కరి సొత్తు కాదు. పంచుకోండోయి పంచ పాండవులునూ, అంది కుంతి. అంతా అనుమానిస్తే పంచగడ్డాలు పెంచు

కొన్న వ్యాసుడే వచ్చి ఆడది ఒక్కరి సొత్తు గాదు. పంచుకోండోయి అని చెప్పాడు. అంతే! కిమన్నాస్తి. అంతా వాటాలు వేసుకొని ద్రౌపదిని పంచుకొన్నారు. వాటా పట్టుకొంటూ ధర్మరాజు మహానుభావు డేమన్నాడో తెలుసునా! మా మాత పంచభర్తుక. కాన తన కోడలిని గూడ తనంతదానిని జేసి భారత గౌరవము నిలువబెట్టినదని సంతోషిస్తూ చెప్పినాడు. కాబట్టి అల్లా పైకి వెళ్లడం ప్రారంభించావంటే భూలోకమే గాదు చతుర్దశ లోకాలు దాటిపోతాం తెలుసునా? అందుకు చేత స్త్రీ ఒక్కరి సొత్తుగాదు, ఆనందో బ్రహ్మ. ఎక్కడ ఆనందం వుంటే అక్కడ బ్రహ్మ సాక్షాత్కరిస్తాడు. అందులో ఋషులమీద మరీ తేలికగా బ్రహ్మ ఆవహిస్తాడు. వాళ్లకి ఆనందం యెక్కువ వుంటుంది కాబట్టి ఆనందంకోసమే ఋషి బ్రహ్మర్షి అవుతాడు. ఆ బ్రహ్మర్షిలో బ్రహ్మని తీసెయ్యి. ఇక వట్టి తల్లక్రిందుల పక్షియై వూరుకొంటాడు బ్రహ్మర్షి అంతేనండు. కాన ఆనందం ఆడదానితో వుంది. ఆ ఆనందం అంతా పంచుకోండి అని చెప్పిన కుంతీ వాక్యార్థము శాస్త్రి ప్రమాణమే నా?

పార్వ:—ఔను. ఔను. కుంతి యంత గొప్ప గొప్ప మహర్షులు బ్రహ్మర్షులు చెప్పినప్పుడు నమ్మి తీరాలి.

కాంతం:—అల్లాగే.

బుచ్చే:—ఔను. అల్లాగే.

గిరీ.—That is alright. కాబట్టి అఖరి ముక్క వినండి. ఎవరు యెవరిని Love చేస్తే వారు వారితో బ్రహ్మానందం అనుభవించ వచ్చును. ఏం నాయుడు బావా? మూడవవారి అభ్యంతరం గిభ్యంతరం నైజాన్ తా.

నాయు:—మీరు చెప్పింది నిజంలాగే వుందండి.

పార్వ:—Quite alright.

గిరీ:—ఇంకొక్క విషయం—సృష్టియే అస్థిరం—అశాశ్వతం—సర్వం మిధ్య—జగం మిధ్య—ఇవ్వాళ వున్నవారు రేపు టపా కట్టేస్తున్నారు. పోని పోయేటప్పుడు యేమైనా మూటగట్టుకొని పోతున్నాడా. అదీ లేదు. మిగిలిన వాళ్లకోసం దిగబెట్టి పోతున్నాడు. బుచ్చెమ్మని భర్త నాకోఅకు దిగబెట్టి చక్కా పోయాడు. నిన్న రాత్రి స్వప్నంబులో బుచ్చెమ్మని నేను బాగా కనిపెట్టి చూస్తూ వున్నందుకు చాలా సంతోషిస్తూ వున్నానని చెప్పాడు. కాబట్టి పుణ్యలోకాల్లో వున్నవాళ్లకే వాళ్ల భార్యల ప్రవర్తనాలు సరిపడుచున్నప్పుడు మనం సరిపెట్టుకోకపోవడం తప్పు మందే. ఏం నాయుడు బావా!

కాంత, బుచ్చే:—అయితే మేం వెడుతున్నాం. ఇవాళ వున్నవారు రేపుండరు. రా, బుచ్చెమ్మ. నాయుడు బావ, సర్వం మిధ్యేరా! మనం ముగ్గురు కలిసి కాపురం జేద్దాం. బాబింగు జుట్టు—నీవు—అందంగా వున్నావు.

పార్వ:—అ! అ!! అంతే! అంతే!! నేను బాబింగు జుట్టు పెంచుకొంటా.

గిరీ.—Nonsense కథ అడ్డం తిరిగింది. Damit

(అందరు నిష్క్రమింతురు)

పొంగలి పండుగకి కావలసిన రకాలు అన్నీ మావద్ద ఉన్నవి.

చీరలు (సిల్కువి, నూలువి), బెంగుళూరు, నెల్లూరు, పూనా, ప్రొద్దుటూరు, సేలం, లూథియానా, అహమ్మదాబాదు మొదలగు చోట్లనుండి తెప్పించి యున్నాము.

మావద్ద బెంగుళూరు నేత పట్టుచీరలు 9 గజములవి, భారమునుబట్టి రూ. 10-14 మొదలు రూ. 14 వరకు ఖరీదు చేయునవి కలవు.

షై లేచరు సిల్కు చీరలు, వానివాని తరములనుబట్టి రూ. 16 నుండి రూ. 20-ల ఖరీదువఱకు లభించును.

కేశవరామ్ అండ్ కంపెని,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.